ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 28.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మూసీ ప్రక్షాళన చేయకపోతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తప్పవని వెల్లడించారు
2. దేశంలోని ప్రజలు విద్యుత్ కొనుక్కునే స్థాయి నుంచి విద్యుత్ ను అమ్ముకునే స్థాయికి చేరుకోవాలనేది ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.
3. భద్రాద్రిలో శ్రీరామ మహా పట్టాభిషేకం అత్యంత వైభవోపేతంగా జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు
4. అంగన్ వాడి వ్యవస్థను పటిష్ట పరిచే దిశలో భాగంగా త్వరలో 15 వేల పోస్టులను భరక్తీ చేయనున్నట్లు మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రకటించారు.

-------------------------

**ఓంకారేశ్వర ఆలయం శంకుస్థాపన**

మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మరో ముందడుగు పడింది. మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణం భగవత్ కార్యంగా భావిస్తున్నానని అన్నారు. ముచుకుంద నదికి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. గతంలో గోదావరి, కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకోలేకపోయామని, ఇప్పుడు ఆ

జలాలను ఉపయోగించుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ కాలుష్య నగరంగా మారకూడదని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. మూసీ ప్రక్షాళన ఇప్పుడు చేసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తప్పవని తెలిపారు. నదులు కాలుష్యం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**బైట్ - ముఖ్యమంత్రి**

**పీటీసీ – హైదరాబాద్**

---------------------------

**AI - CM**

'కృత్రిమ మేధ(ఏఐ) మానవ చరిత్రలో గొప్ప ఆవిష్కరణ అయినప్పటికీ.. ఇది రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. సరైన నియంత్రణలు లేకపోతే.. దాని ప్రతికూల ప్రభావాలు పెరిగే అవకాశం ఉందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ ఆధ్వర్యంలో హార్వర్డ్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిన్న జరిగిన తొలి ఏఐ సింపోజియంలో తెలంగాణ తరఫున ఆయన వర్చువల్‌గా పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కొత్త సాంకేతికతలపై ఉన్న భయాలు సహజమే అయినా.. ఏఐ విషయంలో పరిస్థితి భిన్నం. ప్రపంచానికి ఏఐ విసురుతున్న సవాళ్లకు సమాధానంగా 'తెలంగాణ రైజింగ్' వ్యూహాన్ని అమలు చేస్తున్నామ ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

**డెస్క్**

----------------------------

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

తెలంగాణలో పెట్రో ఉత్పత్తుల సరఫరా సజావుగా కొనసాగేలా చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిన్న సాయంత్రం జరిపిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలో సాధారణ రోజుల్లో రోజుకు 36 వేల 189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతుందని, ప్రస్తుతం ఒక లక్ష

88 వేల 210 కిలో లీటర్ల నిల్వలు ఉన్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**డెస్క్**

--------------------------------

**మూసీ నదిపై సబ్ కమిటీ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రణాళిక, సమన్వయం, అమలును పర్యవేక్షించేందుకు ముగ్గురు మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేబినెట్ సబ్ కమిటీకి డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరించన్నారు.

**డెస్క్**

---------------------------

**బండి సంజయ్**

దేశంలోని ప్రజలు విద్యుత్ కొనుక్కునే స్థాయి నుండి విద్యుత్ ను అమ్ముకునే స్థాయికి చేరుకోవాలనేది దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెడ్ కో అధికారులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ 10 కెవి సోలార్ విద్యుత్ ను  ప్రాజెక్ట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ దేశంలోని కోటి మంది ఇండ్ల పై పీఎం సూర్య ఘర్ పథకం క్రింద  సోలార్ ప్యానెల్స్  ఏర్పాటు చేసే విధంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం 70 వేల కోట్ల రూపాయలు

కేటాయించినట్లు తెలిపారు. దీని వలన 300 యూనిట్ల ఉచిత విద్యుత్ రావడంతో పాటు 30 వేల నుంచి 78 వేల వరకు ప్రభుత్వ సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు.

**బైట్ - బండి సంజయ్ కుమార్**

**పీటీసీ - కరీంనగర్**

------------------------------

**భద్రాచలం**

భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీరామ నవమి వేడుకల మరుసటి రోజు జరిగే శ్రీరామ మహా పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవోపేతంగా జరుగుతోంది. స్వామి వారి కళ్యాణం జరిగిన మిథిలా స్టేడియంలోనే శ్రీరామచంద్రుడు పట్టాభిషిక్తుడిని చేస్తున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఈ మహా క్రతువు కన్నుల పండువగా సాగుతోంది. ఈ ఉదయం కళ్యాణ రాముడిని మిథిలా స్టేడియానికి ఊరేగింపుగా తీసుకొచ్చిన వైదిక పెద్దలు.. అనంతరం భక్త రామదాసు చేయించిన స్వర్ణ కిరీటం తో పాటు రాజ ముద్రిక, ఖడ్గం, రత్నాభరణాలు ధరింప చేసి రాజ లాంఛనాలతో శ్రీరామ పట్టాభిషేకం వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీరామ పట్టాభిషేకం కనులారా వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

**పీటీసీ – భద్రాద్రి కొత్తగూడెం**

------------------------------

**అసెంబ్లీ సీతక్క**

జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న విధంగా మహిళల భద్రత, సాధికారత కోసం తమ ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందిస్తుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. అసెంబ్లీలో ఈరోజు మంత్రి మాట్లాడుతూ.. మహిళలు స్వేచ్ఛగా పనిచేసుకునే విధంగా, వివక్ష లేకుండా మహిళల గౌరవాన్ని పెంచే విధంగా ప్రత్యేక చర్యలు

తీసుకుంటున్నట్లు చెప్పారు. అంగన్ వాడీ కేంద్రాలు మరింత పటిష్ట పరిచే లక్ష్యంతో రానున్న కాలంలో 15వేల అంగన్ వాడీ పోస్టులు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా బాలింతల సౌకర్యార్థం ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు సీతక్క తెలియజేశారు. మహిళా సంక్షేమం కోసం నిధులను వెచ్చించడం లేదని ప్రతిపక్షాలు అనడం సరికాదని మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికోసం 17వేల 229 కోట్లు ఖర్చు చేశామని, 2వేల 199 కోట్ల విలువైన లక్ష పనులకు శ్రీకారం చుట్టామని మంత్రి పేర్కొన్నారు.

**బైట్ - సీతక్క**

**MSM**

--------------------------------

**కిషన్ రెడ్డి పర్యటన**

హైదరాబద్ లోని బేగంపేట్ డివిజన్ భగవంత్ పూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇవాళ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అంగన్వాడీల అభివృద్ధికి, మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నాని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆరోగ్య సిబ్బంది, పోషణ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ, ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు.  అలాగే పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలు రావడానికి ప్రోత్సహించాలని సూచించారు.

**పీటీసీ – హైదరాబాద్**

--------------------------------

**లోక్ అదాలత్ - ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా జడ్జి ఏ.వీరయ్య మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా

కోర్టులో జిల్లా జడ్జి వీరయ్య నేతృత్వంలో ఒకటి, సీనియర్ సివిల్ జడ్జి యువ రాజ, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మిల నేతృత్వంలో వేరువేరుగా మూడు బెంచీలు ఏర్పాటు చేయగా, సిర్పూర్ కోర్టు లో ఒక బెంచ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత లోక్ అదాలత్ కంటే ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. లోక్ అదాలత్ కు వచ్చే వారికి పోలీసులు తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

------------------------------

**అక్రమ ఇసుక రవాణా**

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని,రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'మన ఇసుక వాహనం' ద్వారా ఇసుకను సరఫరా చేయాలని.. అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా బాధ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలను సైతం సీజ్ చేస్తామని చెప్పారు. గడిచిన మూడు నెలల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిపై 45 కేసులు నమోదు చేసి నట్లు పేర్కొన్నారు. అక్రమ రవాణా, అక్రమ నిల్వలు ఉన్నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-----------------------------------

**హిందూ సమ్మేళనం - నల్గొండ**

ఆచారాలు వేరైనా హైందవ ధర్మం ఒక్కటే, ఆ ధర్మమే శాశ్వతమని ఆరెస్సెస్ జాతీయ కార్యకారిణి సదస్సులు భాగయ్య అన్నారు.. హిందువు అనగానే ప్రేమ, పరాక్రమం, శౌర్యం గుర్తుకు వస్తాయని అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిన్న సాయంత్రం నల్లగొండ పట్టణం లోని శివాజీ పార్కులో హిందూ సమ్మేళనం నిర్వహించారు.

**పీటీసీ – నల్గొండ**

----------------------------------

**శ్రీరామ నవమి శోభాయాత్ర**

శ్రీరామనవమిని పురస్కరించుకొని నిన్న హైదరాబాద్‌లో శ్రీరాముడి శోభాయాత్ర వైభవోపేతంగా జరిగింది. సీతారాంబాగ్ ఆలయంలో జరిగిన జానకీరాముల కల్యాణ క్రతువులో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ పాల్గొన్నారు. అంబర్ పేట మున్సిపల్ గ్రౌండ్‌లో శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. పూజ కార్యక్రమం అనంతరం జెండా ఊపి శోభాయాత్ర ప్రారంభించారు.

**డెస్క్**

-----------------------------------

**కరీంనగర్**

సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ, అక్రమ లావాదేవీలకు వేదికగా మారుతున్న 'మ్యూల్ బ్యాంక్ ఖాతాల'నెట్‌వర్క్ పై కరీంనగర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ సందర్భంగా **పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియాతో మాట్లాడుతూ...**

**బైట్ - గౌస్ అలం - కమిషనర్**

"ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0" లో భాగంగా నిర్వహించిన దర్యాప్తులో 24 మంది నిందితులను గుర్తించగా, అందులో 13 మందిని అరెస్ట్ చేశారు.

**పీటీసీ - కరీంనగర్**

----------------------------